జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM
గురువారం
19 02 2026
సంపుటి 1 సంచిక 89
పేజీలు : 04
PRGI No :
TGTEL/25/A4195










## గుట్టలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**దశ,యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం స్వస్తివాచనంతో ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు.

# 23 తర్వాత పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు పూర్తి కావడంతో ఇప్పుడు అందరి దృష్టి పరిషత్ ఎన్నికలపై పడింది. ఈ క్రమంలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం తెలంగాణ సర్కార్ సమాయత్తం అవుతోంది. దీంతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి చర్చించేందుకు ఈనెల 23న తెలంగాణ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మంత్రివర్గ సమావేశం తర్వాత.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఒక క్లారిటీ రానుందని తెలుస్తోంది.రాష్ట్రంలో మరో ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తి కావడంతో రేవంత్ రెడ్డి సర్కార్.. స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. త్వరలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 23వ తేదీన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ భేటీలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ

..మిగతా 2వ పేజీలో →



# సివిల్ సర్వెంట్స్... ఖద్దరు చొక్కా భాగ్యం లేదా?



**దశ, హైదరాబాద్**

సివిల్ సర్వీసెస్.. దేశంలోనే అత్యున్నత స్థాయి బాధ్యత. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా వీరు వ్యవస్థను శాసిస్తారు, ఫైళ్ల మీద సంతకాలతో వేలమంది జీవితాలను మారుస్తారు. కానీ, అదే అధికారులు ఖాకీ లేదా తెల్ల చొక్కా వదిలేసి ఖద్దరు చొక్కా కట్టుకోగానే సీన్ రివర్స్ అవుతోంది. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రైవేటు సంస్థలో చేరడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. అటు జయప్రకాశ్ నారాయణ నుంచి ఇటు లక్ష్మీనారాయణ వరకు.. వీరి ప్రయాణాలు ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సిస్టమ్‌ను బయట ఉండి మార్చడం వేరు, సిస్టమ్‌లో భాగంగా మారి రాజకీయ రొంపిలో నెగ్గుకురావడం వేరు అని రుజువు చేస్తున్నాయి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో

..మిగతా 2వ పేజీలో →

## శంషాబాద్ ధర్మగిరి దేవాలయంలో గంజాయి కలకలం

### గంజాయిని దేవుడికి ప్రసాదంగా పెట్టిన యువకులు

**దశ, రంగారెడ్డి:** బడంగ్ పేట్ కు చెందిన చరణ్ తో పాటు అతని స్నేహితులు శివరాత్రి సందర్భంగా శివుడికి గంజాయిని ప్రసాదంగా పెట్టారు. గంజాయిని ప్రసాదంగా పెట్టే వీడియోను తీసి ఇంస్టాగ్రామ్ లో పోస్ట్ చేసారు. అందరూ కొబ్బరికాయ కొట్టేలాగా కాకుండా మేము ప్రత్యేకంగా గంజాయి పెడుతున్నామంటూ వీడియో తీసారు. ఇంస్టాగ్రామ్ లో రీల్ హల్ చల్ కావడంతో నెటిజెన్లు హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ కు ఫిర్యాదు చేసారు. దాంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. యువకులు బడంగ్పేట్ కు చెందిన వారిగా గుర్తించారు. యువకుల కోసం గాలిస్తున్నారు. ఇలాంటి రీల్స్ పెట్టే వారిపై కఠిన



చర్యలు తీసుకుంటామంటూ సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

## మెదక్ కలెక్టర్‌కు జైలు శిక్ష


### నాలుగు వారాల గడువు

### సంచలనంగా మారిన వైనం



**దశ,మెదక్:** కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు హైకోర్టు జైలు శిక్ష విధించడం సంచలనంగా మారింది. చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ భూమి వివరాల కేసును పరిష్కరించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి భూ సమస్యను పరిష్కరించాలని హైకోర్టు కలెక్టర్ రాహుల్ రాజ్ ను ఆదేశించింది. సమస్యను పరిష్కరించకుండా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోలేదంటూ లక్ష్మి కోర్ట్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారించిన హైకోర్టు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విదిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. తరువాత తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది. ఆపిల్ చేసుకునేందుకు కలెక్టర్ కు నాలుగు వారాల పాటు హైకోర్టు గడువు ఇచ్చింది.

## హైకోర్టులో ఆకుల యాదగిరిని ప్రవేశపెట్టిన పోలీసులు



**దశ, రంగారెడ్డి :** ఇబ్రహీంపట్నం 19వ కౌన్సిలర్ ఆకుల యాదగిరి ని పోలీసులు హైకోర్టు లో హాజరు పరచారు. అయన కుటుంబ సభ్యులు ఆకుల యాదగిరి కనిపించడం లేదని హిబియస్ కార్పస్ వేసిన విషయం తెలిసిందే. యాదగిరిని హైకోర్టు ముందు హాజరు పరచాలని రెండు రోజులు క్రితం న్యాయస్థానం ఆదేశించింది. మరోవైపు క్యాంపు పేరుతో తన భర్తను కిడ్నాప్ చేశారని ఆకుల యాదగిరి భార్య వసంత పిర్యాదు చేసారు. మిస్సింగ్ పై పోలీసులు కేసు నమోదు చేసారు. ఇబ్రహీంపట్నం బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అతని తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పై ఆకుల యాదగిరి భార్య అనుమానాలు వ్యక్తం చేసింది.

# భవిష్యత్తు హరిత తెలంగాణదే

## ముంబై క్లైమేట్ వీక్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష

**హైదరాబాద్‌కు 2034 నాటికే నెట్-జీరో లక్ష్యం.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం రూపాంతరం**

**ముంబై/హైదరాబాద్:** మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్ల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త హరిత విప్లవానికి నాంది పలకనుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ముంబైలో జరిగిన 'క్లైమేట్ వీక్' సదస్సులో ఆయన పాల్గొని, పర్యావరణ పరిరక్షణతో కూడిన రాష్ట్ర ఆర్థిక ప్రగతి రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**శక్తి (Power) భవిష్యత్తు కరెన్సీ**

1947 నుంచి 2047 వరకు భారతదేశ ప్రయాణాన్ని విశ్లేషిస్తూ.. 195090 మధ్య ఆహార భద్రతను సాధించామని, 1991 సంస్కరణలు మనల్ని సేవా రంగంలో అగ్రగామిగా నిలిపాయని

..మిగతా 2వ పేజీలో →



జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
గురువారం 19-02-2026
స్టేట్ న్యూస్
WWW.DASHANEWS.COM

# పకడ్బందీగా బోర్డు పరీక్షలు

## ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం


**దశ హన్మకొండ ప్రతినిధి:** జిల్లాలో పదో తరగతి,ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్,పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు,నిర్వహణ అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరీక్షా సమయానికి ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని..అందుకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు



ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని,అవసరమైన చోట్ల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 52 సెంటర్లలో మొదటి సంవత్సరం విద్యార్థులు 18,590 మంది పరీక్షలు రాయడం జరుగుతుందని,అదేవిధంగా 20వేల 4వందల మంది విద్యార్థులు రెండవ సంవత్సరం పరీక్షలు రాయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందుకుగాను పరీక్షా కేంద్రాలలో శానిటేషన్, త్రాగునీరు, తదితర సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రతి సెంటర్లో రెండు నుంచి మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సెల్ ఫోన్లు అనుమతించబడవని, అంతేకాకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష సమయానికి ముందు కస్టోడియన్ అధికారులు పోలీసు వారి సహకారంతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్న పత్రాలు పంపడం జరుగుతుందని అన్నారు. మార్చి 14 నుండి నిర్వహించే ఎస్.ఎస్.సి వార్షిక పరీక్షలకు జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు జరిగిందని 12వేల 079 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలు మౌలిక వసతులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## గణిత ఉపాధ్యాయుడిగా కలెక్టర్

**దశ యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో జిల్లాపరిషత్ హైస్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు. స్కూల్ లో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది ,అందులో 10 వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. అన్ని సబ్జెక్ట్స్ సిలబస్ లు పూర్తి చేశారా .రోజుసాయంత్రం స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయ. ఉదయాన్నే 5 గంటలకు పిల్లకి వేక్ అప్ కాల్ చేస్తున్నారా అని అడిగారు..అనంతరం 10 వ తరగతి విద్యార్థులకి గణితంలో ప్రశ్నలు వేసి అడిగారు. బోర్డు పై వాటికి సమాధానాలు చెప్పారు. పరీక్షల సమయం దగ్గర పడుతుంది ఇప్పటి నుండి సిద్ధం అవ్వాలి అని చెప్పారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు సంఖ్య పెంచాలి అని ఉపాధ్యాయులకి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి బోధన అందుతుంది ఇప్పటి నుండే గ్రామంలో ప్రజలకి ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధన పై అవగాహన కల్పించాలి గ్రామంలో ఉండే ప్రతి విద్యార్థి మన ప్రభుత్వ బడిలో చదువుకునేల చూడాలి అని అన్నారు.



## కొండ పైన ఉచిత వైద్య సేవలు...

**దశ యాదగిరిగుట్ట:** శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం,శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవముల సందర్భంగా కొండపైన మెడికవర్ హాస్పిటల్ నేటి నుండి ఈ నెల 28 వరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఆలయ ఈఓ భవాని శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించిన్నారు. డా. టి. పృధ్వి, డి.ఎన్.బి (జనరల్ మెడిసిన్), జనరల్ ఫిజీషియన్, మెడికవర్ హైటెక్ సిటీ హైదరాబాద్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.





## గవర్నర్ చేతుల మీదుగా 'విశిష్ట ప్రతిభా రత్న' అవార్డు

### నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు హరిక, ఆరాధ్య. - కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి

**దశ, నాగారం:** హిందీ సేవా సదన్ మహావిద్యాలయ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు హరిక, ఆరాధ్య గవర్నర్ చేతుల మీదుగా 'విశిష్ట ప్రతిభా రత్న' పురస్కారం అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానం సాధించి రూ.2,500 నగదు పురస్కారం, బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకోవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, విద్యార్థులను పాఠశాల తరఫున బుధవారం విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు

## ముస్లిం సోదరులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు

**దశ, మేడ్చల్:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఉపవాస దీక్షలకు ఉపక్రమించిన ముస్లిం సోదరులకు రంజాన్ నెల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కౌన్సిల్ సభ్యులకు సన్మానం

**దశ,గజ్వేల్:** AITUC కార్మిక సంఘం



నాయకులు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఆర్ ఎన్ ఆర్ కాలనీ, పల్లెపాహాడు ప్రాంతంలో జరిగింది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 7వ వార్డు కౌన్సిల్ సభ్యుడు మన్నెం విష్ణువర్ధన్ రెడ్డి,8వ వార్డు కౌన్సిల్ సభ్యుడు గుగ్లోత్ రమేష్,9వ వార్డు కౌన్సిల్ సభ్యుడు శెంపల్లె ఉపేందర్ రెడ్డి,12వ వార్డు కౌన్సిల్ సభ్యుడు ఎల్దండి నరసింహారెడ్డిని పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ,తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని,అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివలింగ కృష్ణ, సంఘం నాయకులు చింతకింది స్వామి,కొండ కింది పోచయ్య,కొండిరాజ్యం,హమాలి నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## 23 తర్వాత పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి**

మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై.. సీఎం, మంత్రులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా తెలంగాణ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై కీలక చర్చలు జరపనున్నారు.అదేసమయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పరిషత్ ఎన్నికల గడువు పూర్తి కావడం.. ఇటీవలె సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ముగియడంతో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో రేవంత్ సర్కార్ ఉంది.అదే సమయంలో త్వరలోనే జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు కూడ ముగియనుండటంతో ఆ ఎన్నికలపైనా కేబినెట్ భేటీలో చర్చలు జరపనున్నారు. ఇక ఇటీవలె జీహెచ్ఎంసీని 3 కార్పొరేషన్లుగా విభజించగా.. ఎన్నికలు ఎలా నిర్వహించాలి, ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి, వాటిని ఎలా అధిగమించాలి అనే దానిపై చర్చించనున్నారు.మరోవైపు.. ఈ మంత్రి వర్గ సమావేశానికి ముందే తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక సంఘటన చోటు చేసుకోనుంది. ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు దేశ రాజధాని ఢిల్లీలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన ఏఐసీసీ వేదికగా కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం ఢిల్లీకి వెళ్లనుంది.కేబినెట్ భేటీకి ముందు హస్తం పార్టీ అధిష్ఠానంతో జరగనున్న ఈ భేటీ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు.. ఆ తర్వాత జరిగే కేబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు అనేది ఇప్పుడు తెలంగాణలో ఆసక్తిగా మారింది.

## భవిష్యత్తు హరిత తెలంగాణదే

**మొదటి పేజీ తరువాయి**

సీఎం గుర్తుచేశారు. అయితే, తయారీ రంగంలో మనం ఆశించిన అవకాశాలను అందుకోలేకపోయామని ఆయన అభిప్రాయపడ్డారు. "కోవిడ్ తర్వాత ప్రపంచంలో 'శక్తి' (Energy) అనేది అత్యంత కీలకమైన కరెన్సీగా మారింది. 2034 నాటికి తెలంగాణ విద్యుత్ అవసరాలు రెట్టింపై 34,000 మెగావాట్లకు చేరుకుంటాయి. ఈ డిమాండ్‌ను పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా అధిగమిస్తూ, గ్రీన్ మ్యానుఫ్యాక్చరింగ్ విప్లవంలో తెలంగాణ గ్లోబల్ ఆల్టర్నేటివ్‌గా (China +1 strategy) నిలుస్తుంది," అని రేవంత్ రెడ్డి వివరించారు.





### 2034కే హైదరాబాద్ 'నెట్-జీరో'

పర్యావరణ హిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు సీఎం కీలక ప్రకటనలు చేశారు:

**కార్బన్ ఆడిట్:** నగరంలో ఉద్గారాలను శాస్త్రీయంగా లెక్కించేందుకు త్వరలోనే సమగ్ర 'కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్' నిర్వహిస్తారు. **పరిశ్రమల తరలింపు:** కాలుష్యాన్ని తగ్గించేందుకు రాబోయే ఐదేళ్లలో నగర నడిబొడ్డున ఉన్న పరిశ్రమలను శివారు ప్రాంతాలకు (Periurban zones) తరలిస్తారు. ఇవన్నీ గ్రీన్ ఎనర్జీ గ్రిడ్ల ద్వారానే నడుస్తాయి. రాష్ట్రం 2047 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను, హైదరాబాద్ నగరం ఒక దశాబ్దం ముందే అంటే 2034 నాటికే 'నెట్‌జీరో' స్థాయిని అందుకోవాలని గడువు విధించారు.

**పర్యావరణ రక్షణకు మూలస్తంభాలు: మూసీ, హైడ్రా (HYDRAA)**

మూసీ నది పునరుజ్జీవనం కేవలం పర్యాటక ప్రాజెక్టు మాత్రమే కాదని, అది నగరానికి ఒక జీవనాడి, ఎకలాజికల్ బఫర్ అని సీఎం పేర్కొన్నారు. అలాగే, చెరువులు, కుంటల పరిరక్షణ కోసం దేశంలోనే మొట్టమొదటి పర్యావరణ పోలీసు విభాగం 'హైడ్రా' (HYDRAA)ను ఏర్పాటు చేసినట్లు గర్వంగా ప్రకటించారు. హరిత రవాణాపై దృష్టి సారిస్తూ, ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను మినహాయింపులతో పాటు రాష్ట్రంలోనే ఈవీ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేలా దిగ్గజ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల జిడిపితో ఉందని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుతూ భారత జిడిపిలో 10 శాతం వాటాను తెలంగాణ అందిస్తుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## సివిల్ సర్వెంట్స్.. ఖద్దరు చొక్కా భాగ్యం లేదా?

**మొదటి పేజీ తరువాయి**

ఒక వెలుగు వెలిగిన ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ. 'లోక్ సత్తా' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పాలనా సంస్కరణల కోసం పోరాడి, ఆ తర్వాత దానిని రాజకీయ పార్టీగా మార్చారు. జేపీ రాజకీయాల్లో 'నైతికత' గురించి మాట్లాడారు. కానీ భారతీయ ఓటరు నాడి కేవలం సిద్ధాంతాల మీద మాత్రమే పనిచేయదు. కుల, మత సమీకరణలు, ధన ప్రభావం ఉన్న రాజకీయ క్షేత్రంలో జేపీ మేధోమథనం సామాన్య ఓటరుకు చేరువ కాలేకపోయింది. కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, అసెంబ్లీలో ఆయన ఒంటరి అయ్యారు. చివరకు రాజకీయాల్లో తన గళం వినిపించే అవకాశం లేదని గ్రహించి, ప్రస్తుతం ఆయన కేవలం సామాజిక విశ్లేషకుడిగానే మిగిలిపోయారు.సీబీఐ మాజీ జేడీగా లక్ష్మీనారాయణ పేరు చెబితే అవినీతిపరుల వెన్నులో వణుకు పుట్టేది. ఆ క్రేజ్‌తోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, గణనీయమైన ఓట్లు సాధించారు. కానీ అక్కడితోనే ఆయన గ్రాఫ్ ఆగిపోయింది. ముందుగా జనసేనలో చేరడం, ఆ తర్వాత రాజీనామా చేయడం, మళ్ళీ సొంతంగా జై భారత్ నేషనల్ పార్టీ పెట్టడం.. లాంటివన్నీ ప్రజల్లో అయోమయాన్ని సృష్టించాయి. పోలీసు అధికారిగా కఠినంగా ఉండటం అలవాటైన లక్ష్మీనారాయణకు, రాజకీయాల్లో ఉండే అనునిత్యం రాజీపడే తత్వం సెట్ కాలేదు. రాజకీయాల్లో మార్పు తీసుకురావడం కంటే, ప్రైవేటు రంగంలో సేవ చేయడం ఉత్తమమని భావించి ఆయన 'ఈవీ ట్రాన్స్' సంస్థలో బాధ్యతలు చేపట్టారు. ఇది ఆయన రాజకీయ ప్రస్థానానికి దాదాపు ముగింపు పలికినట్టే అని విశ్లేషకులు భావిస్తున్నారు.రాజకీయాల్లోకి వచ్చే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వైఫల్యానికి ఎన్నో కారణాలున్నాయి. అధికారులుగా ఉన్నప్పుడు వారి మాట శాసనం. అందరూ వారి కింద పని చేస్తారు. కానీ రాజకీయాల్లో 'ప్రజల వద్దకు వెళ్లి అడుక్కోవాలి'. ఈ మనస్తత్వ మార్పు అందరికీ సాధ్యం కాదు. సివిల్ సర్వెంట్లు ప్రతిదీ చట్టబద్ధంగా, సిద్ధాంతపరంగా ఉండాలని కోరుకుంటారు. కానీ రాజకీయం అనేది 'గెలుపే లక్ష్యం'గా సాగే చదరంగం. ఇక్కడ ఎథిక్స్ కంటే స్ట్రాటజీలకే ప్రాధాన్యత ఎక్కువ. రాజకీయ పార్టీ నడపాలంటే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఉండాలి. అధికారులు కేవలం మీడియాలో కనిపించి ఓట్లు రాబట్టలేరు. జేపీ, జేడీ ఇద్దరూ ఈ విషయంలోనే వెనుకబడ్డారు.సివిల్ సర్వెంట్లు రాజకీయాల్లోకి రావడం ప్రజాస్వామ్యానికి మంచిదే అయినా, క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించకపోతే పరాజయం తప్పదని ఈ ఇద్దరి ఉదాహరణలు నిరూపిస్తున్నాయి. జేపీ మేధస్సు, జేడీ నిజాయితీ రాజకీయ వ్యవస్థకు అవసరమే, కానీ ఆ వ్యవస్థలో ఇమడలేక వారు వెనక్కి వెళ్లడం దురదృష్టకరం. వ్యవస్థను మార్చాలనే తపనతో వచ్చి, చివరకు వ్యవస్థ గాలికి కొట్టుకుపోవడం లేదా పక్కకు తప్పుకోవడం ఒక చేదు నిజం.

## మైనారిటీలకు కార్పొరేషన్ ద్వారా సహాయం

**దశ, మేడ్చల్ జిల్లా కలెక్టరేట్:** తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీలకుఅందిస్తున్న ఆర్థిక సహాయం కార్యక్రమానికిముఖ్యఅతిథిగాహాజరైనపాల్గొన్నరాష్ట్రమైనారిటీసంక్షేమశాఖమంత్రిమహమ్మద్ అజారుద్దీన్, శాసన మండలి లో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్ , గురుకుల పాఠశాల చైర్మన్ ఫయిమ్,ఎంఎల్సీలు ఇంఫెండీ, మీర్జా రహమత్ బేగ్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సెక్రటరీ షఫీఉల్లా , ఎంజీఎం పర్సిస్ మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ లు హాజరైనారు. అంతరం ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి మైనారిటీ వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారనీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ మైనారిటీలలో అభ్యున్నతికి కృషి చేస్తుండగా మేం అండగా నిలుస్తున్నామన్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తున్న ఆర్థిక సహాయం లో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి,మేడ్చల్ జిల్లాలో మైనారిటీలకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ప్రస్తుతం ఎంపిక చేసిన 225 మందిలో 5 మందికి కోటి కోటీ 12 లక్షల 50 వేల చెక్కును పంపిణీ చేశారు. ప్రతి నిరుపేద మహిళలకు రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని,అలాగే సీఎం రేవంత్ రెడ్డి భరోసా పథకం కింద మైనారిటీలకు బైకుల పంపిణీ మేడ్చల్ జిల్లాలో 25 మందికి వాహనాల పంపిణీ, ప్రతి వాహనం రూ. లక్ష విలువ గలిదై ఉండగా 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం 13 మందికి వాహనాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.